# కీలల బరువు

నూతన దంపతులు సినిమా చూస్తున్నారు. నూతన దాంపత్యమే ఒక సినిమా. తా మొక సినిమా–తమ ముందు నడిచే సినిమా ఒక సినిమా. కాబట్టి నూతన దంపతులు సినిమా చూస్తున్నారు అనటంకంటే ఒకసినిమా మరొక సినిమాను చూస్తూవుంది అనటం నిజం. నిజం అనటం నా కొక వ్యసనం.

సినిమా ఆట అయింది. అయిపోగానే అంతా కేకలు వేసుకుంటూ, యీలలు వేసుకుంటూ లేచారు నుతన దంపతులు మాత్రం లేవలేదు. వెలుతురు కనబడగానే కంగారు పడ్డారు. ప్రేమే వెలుతురు వెలుతురే ప్రేమ. కాని ప్రేమకూ వెలుతురుకి పడకుండా చేసిందీ పాడులోకం. సినిమా అయిపోవటం, సినిమా చూట్టానికీ వచ్చిన అంధులంతా ఏకమై వారివంకకు చూపులు త్రిప్పటమూ....అన్నీ ఒకేసారి జరిగిపోయినై. అందువల్ల నూతన దంపతులు అందరితోపాటు లేవలేకపోయారు. ఒళ్ళు సవరించుకొని లేచేటప్పటికి ఎట్లాలేసన్నా ఒకటి రెండు నిమిషాలు పట్టింది. ఒదిగి వొదిగి గోడకు అనుకున్న బల్లులై బయటపడ్డారు. జనాన్నుంచి బయటబడ్డారు. ప్రపంచాన్నుంచి యీ జనాన్ని విడదీసి, ఒకటిగా నిలిపిన గేట్లోనుంచి బయటపడ్డారు.

ఆ జనాన్నుంచీ, ఆ గేట్లోనుంచీ బయట పడగానే మరో ప్రపంచంలోకి వచ్చినట్లయింది నూతన దంపతులకు. అది వాళ్ళకు అలవాటైన మామూలు ప్రపంచమే అవటంవల్ల దంపతుడు తమ మామూలు అలవాటు ప్రకారం రిక్షాను పిలిచాడు; రిక్షా కదిలింది. దంపతి మాత్రం వొద్దన్నది.

"నడిచి వెళ్దాం" అన్నది.

"ఏం, రిక్షా ఎక్కగూడదా?" అని అడిగాడు దంపతుడు.

నిజంగానే దంపతికి రిక్షా ఎక్కాలనిలేదు. ఎన్ని చెప్పినా రిక్షా ఎక్కటం తప్పుగానూ, పాపంగానే కనిపిస్తుంది. కాని అది ఎలా పాపమో ఆమె సహేతుకంగా నిరూపించలేదు. అందుకని రిక్షా ఎక్కగూడదని అనకుండా "నడిచి వెళ్దాం" అన్నది.

"మరేం ఫరవాలేదు. తప్పేంకాదు. పాపం అంతకంటే కాదు. మనం ఎక్కితే వాడికి పావలాడబ్బులు దొరుకుతై. ఒకపూట తిండి తింటాడు లేకపోతే అదీలేదు. మనం రిక్షా ఎక్కటం వాడికోసమే. ఎక్కు" అన్నాడు.

"మనం రిక్షా ఎక్కి గుర్రపుబండివాడి నోట మట్టి కొట్టటంలేదా?" అని అడుగుదా మనుకుంది దంపతి. అంతలో గుర్రపుబండికి తమ ఇంటికి అర్థరూపాయైతే, రిక్షాకి పావలే అని జ్ఞాపకం వచ్చింది ఆ ఇల్లాలికి. వెంటనే చిరునవ్వులు వొలక పోసుకుంటూ రిక్షా ఎక్కి కూర్చుంది.

"కాస్త జరుగు!"

* * *

నూతన దంపతులు రిక్షామీద వెళ్తున్నారు. అది ఆంధ్రదేశం నడిబొడ్డు నడిబొడ్డు అంటే రిపేర్స్ తక్కువ! గతుకులు ఎక్కువ. జనం తండోపతండాలుగా రోడ్డు మధ్యగా నడుస్తారు. ఒకరి వెనక ఒకరు; ప్రక్క నడువరు. సినిమా చూచి వూరుకోరు. ఆనందాన్నయినా, అయిష్టాన్నయినా మనస్సులో వుంచుకోరు. రోడ్డుమీద ఎక్కి తమ అభిప్రాయాలను పూర్వం పల్లెటూళ్ళలో సంక్రాంతి పండుగకు తోటాలను విడిచిపెట్టినట్టూ, పెళ్ళిళ్ళకు బాణ్ లను విడిచిపెట్టినట్లూ విడిచి పెడతారు.

రిక్షా వీరందరినీ తప్పించుకొని పాము మెలికలు తిరిగినట్లు తిరుగుతూ వెళ్తూవుంది. ఒక వంతెన అడ్డువచ్చింది. ఆ వంతెన ఎత్తుగా వుంది. రిక్షావాడు ముసలివాడు. ఎముకలప్రోగు. లాగలేక లాగుతున్నాడు. మధ్యకు వచ్చేటప్పటికి వాడెక్కడ లాగలేకపోతాడో, ఎక్కడ రిక్షా

బర్రున వెనక్కి వెళ్ళిపోయి తలక్రిందులౌతుందో అనే భయం నూతన దంపతులకు పట్టుకుంది. రిక్షా వెనక్కి వెళ్ళకుండా వుండగలందులకు ఇద్దరూ ముందుకు వంగారు. రిక్షావాడు ఊబిలో దిగిన బండిని లాగే ఎద్దుకు మల్లే మెడసాచి, పట్టుపట్టి రిక్షానువంతెన మీదకు లాగాడు. నూతన దంపతులు చెరొక నిట్టూర్పు విడిచారు. రిక్షా వంతెన దిగటం మొదలు పెట్టింది. నూతన దంపతులకు మళ్ళీ భయం పట్టుకుంది. రిక్షా తాగినవాడికి మల్లే పళంతప్పి రయ్యీన వెళ్ళిపోతూవుంది. రిక్షావాడు కమ్ములు పట్టుకొని ఎగిరెగిరి పడుతున్నాడు. ఇప్పటిదాకా రిక్షాని వాడు లాగాడు; ఇప్పుడు రిక్షా వాణ్ణి లాగుతూవుంది. నూతనదంపతులు బిగబట్టుకు కూర్చున్నారు. తమని ఇంత ఇబ్బంది పెడుతున్నందుకు అతనికి రిక్షావాడిమీద కోపం వచ్చింది. ఏమంటే ఏమవుతుందో అని లోలోపలా రాజుతూ రిక్షా వేగం తగ్గించటానికి వెనక్కి ఆనుకొనికూర్చున్నారు క్రమక్రమేణా రిక్షా వేగం తగ్గింది, రిక్షా వేగంతో పాటు నూతన దంతతుల గుండెదడ తగ్గింది.

"ప్రక్కకి తిప్పు" అన్నాడు దంపతుడు.

రిక్షా ప్రక్కసందులోకి తిరిగింది. ఆంధ్రదేశం నడిబొడ్డు పెద్ద బజార్లలో గతుకులుంపై. ఇక సందుల్లో అంటారా? ప్రతి చిన్న సందు ఒక పెద్ద గతుకు. అందులో ఆ సందుకి ఇంకా ఎలెక్ట్రిక్ దీపాలు పడలేదు. రిక్షా మన్నుతిన్న పెంజేరుకి మల్లే నెమ్మదిగా, ప్రాణంపోయిన శవానికిమల్లే బరువుగా వెళ్తూ వుంది.

దంపతుని ప్రాణంకొంచెం కుదుటపడ్డది. ఇందాకటినుంచీ రాజు కుంటున్న కోపాన్ని ఒక్కమాటలో వ్యక్తం చేశాడు, "త్వరగా పోనివ్."

"పాపం నడపలేదు...."

"నడపలేక రోగమా.... .... నడపలేనివాడు ఇద్దర్నీ ఎందుకు ఎక్కించుకోవాలి? ముందే చెప్పగూడదూ? నడువ్...."

రిక్షావాడు తన శక్తినంతా కేంద్రీకరించాడు. పరుగుకు కావలసిన వూపుకోసం రిక్షాని ఒక గుంజు గుంజాడు. రిక్షా అతని స్వభావానికి అలవాటు పడిన ప్రాణం, కొరడా పెట్టి కొడితే గుర్రం పరుగెత్తుతుంది. ఒక్క గుంజు గుంజితే రిక్షా లగెత్తుతుంది. అలాగే రిక్షావాడి వెనకపడి లగెత్తుతో వుంది రిక్షా. చీకటిని లెక్క చెయ్యటం లేదు. గతుకుల్ని లెక్క చెయ్యటంలేదు. రిక్షాలో కూర్చున్న నూతన దంపతులు ఉప్పెనగాలికి పడబోయేముందు ఊగే చెట్లకుమల్లే ఊగుతూ కూర్చున్నారు.

"నెమ్మదిగా వెళ్ళమని చెప్పండి" అన్నది దంపతి.

"నువ్వే చెప్పు" అని కోపగించాడు. వెంటనే "కోపం వచ్చిందా?" అని చెయ్యి మీద వేశాడు. ఆమె ఒదిగింది. అతను జరిగాడు. ముద్దు పెట్టుకోబోయాడు. ఆమె ఇంకా ఒదిగింది. రిక్షా ఒరిగింది. రిక్షావాడు గుండె దెబ్బ తిన్న వాడికి మల్లె అడిలాడు. అపాయం గ్రహించి, భయంతో తబ్బిబ్బుపడి, తబ్బిబ్బుపడటంవల్ల అపాయాన్ని కొనితెచ్చుకున్నారు నూతన దంపతులు. రిక్షా తల్లక్రిందులైంది.

* * *

వారిది అనుకూల దాంపత్యం. అందుకని రిక్షాలో నుంచి ఇద్దరూ క్రిందపడ్డారు. ఇద్దరూలేచి నిలబడ్డారు ఇద్దరికీ బట్టలు దులుపుకోవాలని తట్టలేదు. దంపతుడు రిక్షావాని మీదకు రేగాడు. "నువ్వు మనిషి వా? దున్నపోతువా? కాస్త జ్ఞానం వుండక్కర్లా? వెధవా—"

రిక్షావాడు ఏమీ మాట్లాట్టంలేదు. ఏం చేస్తున్నాడో చీకటిలో కనపడటంలేదు.

"లాగలేని వెధవ్వు బాడుగ ఎందుకు ఒప్పుకోవాల్రా? ఆశ— మళ్ళీ ఆశ—"

"ఊరుకుందురూ వాడితో మనకెందుకు? మనదారిన మనం పోదాం. ఎట్లాగు ఇంటిదగ్గరకు వచ్చాం. నాలుగుఅడుగులు వేస్తే మన ఇల్లే—"

ఇందాకటి నుంచి వగర్చుకుంటూ మాట్లాడలేక నుంచున్న రిక్షావాడు వారు నడిచి వెళ్ళటానికి పూనుకున్నారని తెలిసేటప్పటికి మాటలు పెకలించాడు. "జాగర్తగా తీసుకు వెళ్తా—ఏ పెమాదం జరగనియ్యను. ఏదన్నా పెమాదం జరిగితే...."

రిక్షావాడి మాట పూర్తయేదాకా ఆగలేకపోయాడు దంపతుడు? "ఇంకా నీ రిక్షా ఎక్కమన్నావ్రటా వెధవా— కావలిస్తె నీ డబ్బు తీసుకొనిపో" అని ఒక పావలాకాసు వాడి చేతుల్లో పెట్టి బరబరా వెళ్ళిపోతున్నారు దంపతి దంపతుణ్ని అనుసరించింది. తాను రిక్షా లాగలేక పోయే స్థితికి వచ్చాననే భావాన్ని రిక్షావాడు భరించలేకపోయాడు. "దొరా!" అని ఆక్రందనం చేశాడు. ఎదురుగా వెళ్ళి కాళ్ళమీద పడ్డాడు. నూతన దంపతులకి ఆశ్చర్యం వేసింది.

"డబ్బిచ్చాగదరా" అన్నాడు దంపతుడు.

"ఇచ్చావు సామి...."
"మరింకేం?—"
"రిచ్చా యెక్కసామి...."
"నేను నడిచిపోతే నీకేంరా?"

"కాదు సామీ...."
"నీ కేమన్నా పిచ్చా!"
"అవును సామీ—"

రిక్షావాడు కాళ్ళు వొదలలేదు. చేసేదిలేక నూతన దంపతులు మళ్ళీ రిక్షా ఎక్కారు రిక్షావాడు రిక్షాయెత్తాడు. నూతన దంపతులు బరువు యెక్కువయ్యారనే సంగతి వాడు గుర్తు పట్టలేదు అసలు గుర్తుపట్టే స్థితిలోలేడు. తాను రిక్షాలాగలేని స్థితికి వొచ్చాననేభావం వాడి మనస్సుని కెలుకుతూ వుంది. గొంతు సవరించాడు, రిక్షాని వొకగుంజు గుంజాడు. నూతన దంపతులు దేవతా విగ్రహాలకుమల్లే కదలకుండా కూర్చున్నారు! రిక్షావాడు ఆగమేగాలమీద వెళ్ళిపోతున్నాడు. వాడికి చీకటి అడ్డురాలేదు. గతుకులు

అడ్డురాలేదు. 'రిక్షా లాగలేని స్థితికి ఒచ్చాను' అనే కోపమే వాడికి బలాన్నిచ్చింది. వెళ్ళి వెళ్ళి కొత్త దంపతుల యిల్లు చేరుకున్నాడు, తక్కిన ఆగిపోయాడు. కొత్త దంపతులు దిగారు దంపతుని మనస్సులో యిప్పుడు కోపంలేదు రిక్షాపడటానికి కారణం తానయి రిక్షావాణ్ణి కోప్పడినందుకు అతని మనస్సు పశ్చాత్తాపపడింది. ఎక్కడో ఒక కంఠస్వరం "తప్పంతా నీదే" అని చెపుతూవుంది. తాను అంతకుముందిచ్చిన పావలా కాక, మరొక పావలాకాక, మరొక పావలో జేబులోనుంచి తీసి రిక్షావాడి చేతిలో పెట్టాడు. వాడి ముఖం తన యింటి ముందున్న దీపపు వెలుతురులో మెరిసింది. దానికికారణం తను పావలే అనుకున్నాడు దంపతుడు. కాని కారణం అదికాదు. అసలు నిజానికి రిక్షావాడు ఆ క్షణం యీ లోకంలో లేడు "తను రిక్షా లాగగలడు.... లాగగలడు" వాడిముఖంలో మెరిసిన మెరుపుకు కారణం యీ భావం. సంతోషాన్ని పట్టలేక పోయాడు. తాను రిక్షా లాగగలడు.ఇద్దరిని యెక్కించుకొని ఆగమేగాలమీద తీసుకువెళ్ళగలడు. ఇంకేంకావాలి. ఆకలి దప్పులతో అలసి ముడుచుకుపోయిన అతని మనసు యీ సంతోషాన్ని భరించలేకపోయింది. చేతిలోఉన్న పావలా అలాగే వుంది. నెమ్మదిగా పక్కనున్న స్తంభానికి జారగిలబడ్డాడు- మరణించాడు!

రిక్షావాడి మరణం ఆ నూతన దంపతులను వాళ్ళ జీవిత పర్యంతం వెన్నాడుతూనే వుంది. "వాడి మరణానికి కారణం ఎవ్వరు?" అనే విషయంమీద మాత్రం వాళ్ళకి రాజీ కుదరలా.... "ఆ రిక్షా యెక్కకుండా వుంటే పోయేది" అనేది దంపతి. "వాడు మనల్ని యెక్కించుకోకుండా వుంటే పోయేదికాదు?" అనేవాడు. దంపతుడు. దురాశ దుఃఖానికి అంతేగాని, వాడికీ పెళ్లాం పిల్లలుచేటు" అనేవాడు. వుంటారనీ; వాళ్ళకోసం తాను చెయ్యలేని పనులుకూడా చెయ్యటానికివాడు పూనుకుంటాడనీ, అది తప్పనిసరి అనీ, ఆ సంగతి సంఘంలో వుండే అదృష్టవంతులు తెలుసుకొని ప్రవర్తించాలనీ అజనికి యేనాడూతట్టలేదు.